# సాక్షి
## నారాయణపేట

శనివారం । 2 । మార్చి । 2024







**అవకాశాలు అందుకోవాలి**

యువత ఉద్యోగ, ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలని పీయూ వీసీ అన్నారు.

వివరాలు 8లో ▸



**నిబంధనల సడలింపు**

శ్రీశైలానికి శివస్వాముల పాదయాత్ర నేపథ్యంలో అటవీ నిబంధనలు సడలించారు.

వివరాలు 8లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
36.5 /18.0

**వాతావరణం**

ఆకాశం నిర్మలంగా ఉంటూ అప్పుడప్పుడూ మేఘావృతమవుతుంది. మధ్యాహ్నం ఎండ ప్రభావం ఎక్కువగా ఉంటుంది.

## న్యూస్‌రీల్

### అలసందలు క్వింటా రూ.8,206

నారాయణపేట: స్థానిక వ్యవసాయ **మార్కెట్** యార్డులో శుక్రవారం అలసందలు **క్వింటా** గరిష్ఠం, కనిష్ఠం రూ.8,206 ధరలు పలికాయి. అలాగే, శనగలు గరిష్ఠ, కనిష్ఠంగా రూ.5,950, పెసర గరిష్ఠంగా రూ.8,541, కనిష్ఠంగా రూ.8,311, జొన్నలు గరిష్ఠంగా రూ.5,089, కనిష్ఠంగా రూ.3,151, ఎర్ర కందులు గరిష్ఠంగా రూ.10,019, కనిష్ఠంగా రూ.9,969, వేరుశనగ గరిష్ఠంగా రూ.6,429, కనిష్ఠంగా రూ.4,055 ధరలు పలికాయి.

### సీఎం పర్యటన బందోబస్తు ఏర్పాట్ల పరిశీలన

పాలమూరు: ఈ నెల 6న మహబూబ్‌నగర్‌లోని ఎంవీఎస్ డిగ్రీ కళాశాలలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సభకు సంబంధించిన ఏర్పాట్లను ఏఎస్పీ రాములు, డీఎస్పీ వెంకటేశ్వర్లు, మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్, ఇతర కాంగ్రెస్ నేతలు శుక్రవారం పరిశీలించారు. మైదానంలో సభ ఏర్పాట్లు, బందోబస్తు, ట్రాఫిక్ ఇతర అంశాలను పోలీసులు పరిశీలించారు.

### రేపటి నుంచి ఓపెన్ పీజీ తరగతులు ప్రారంభం

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ పీజీ మొదటి సెమిస్టర్ తరగతులు ఈనెల 3 నుంచి ప్రారంభమవుతాయని ఆర్సీఓ సత్యనారాయణగౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు తరగతులకు హాజరయ్యే విద్యార్థులు తప్పకుండా యూనివర్సిటీ పంపించిన పుస్తకాలు, ఐడీ కార్డును వెంట తీసుకురావాలని సూచించారు. మరింత సమాచారం కోసం 73829 29609 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు.

### రేపు హ్యాండ్‌బాల్ ఎంపిక పోటీలు

జడ్చర్ల: మండల పరిధిలోని కోడ్గల్ జెడ్పీహెచ్ఎస్ ఆవరణలో ఈ నెల 3న ఉమ్మడి జిల్లాస్థాయి హ్యాండ్‌బాల్ జూనియర్ బాలుర ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు హ్యాండ్‌బాల్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి శంకర్ నాయక్ తెలిపారు. 2004 జనవరి 1 తర్వాత జన్మించిన వారు పోటీలకు అర్హులని పేర్కొన్నారు. వివరాలకు 99485 85065 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

### స్పోర్ట్స్ అకాడమీ ప్రవేశానికి దరఖాస్తులు

మన్ననూర్: గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 2024– 25 విద్యా సంవత్సరానికి గాను ఆశ్రమ ఉన్నత పాఠశాల బోయిన్‌పల్లిలో వాటర్ స్పోర్ట్స్ అకాడమీలో (క్రీడా పాఠశాల) కయాగింగ్, కనోయింగ్, సెయిలింగ్, ఫెన్సింగ్ క్రీడలలో బాల, బాలికలకు శిక్షణతోపాటు 5వ తరగతిలో ప్రవేశం కోసం దరఖాస్తు చేసుకోవాలని డీటీడీఓ కమలాకర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రవేశానికి గాను విద్యార్థుల ఎత్తు, బరువు, స్టాండింగ్ జంప్, బ్రాడ్ జంప్, వర్టికల్ జంప్, మెడిసిన్ బాల్‌త్రో, 30 మీటర్ల ఫ్లయింగ్ స్టార్ట్, ఫెక్సిబిలిటి టెస్టు, 6"10 కిటిల్ రేస్, 800 మీటర్ల పరుగు పందెం ప్రాతిపదికగా నిర్వహిస్తారు. వీటిలో ప్రతిభ ఆధారంగా 5వ తరగతిలో ప్రవేశానికి జిల్లా నుంచి 10 మంది బాలురు, 10 మంది బాలికలను ఎంపిక చేస్తారు. విద్యార్థులు 31.08.2024 నాటికి 9 నుంచి 11 ఏళ్లలోపు వయస్సు, ఇదే జిల్లాకు చెందిన 4వ తరగతి చదువుతున్న వారు అర్హులు. జిల్లాస్థాయి ఎంపికకు గాను 5.3.2024 ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ట్రైబల్ వెల్ఫేర్ ట్రెనింగ్ సెంటర్ అచ్చంపేటలో నిర్వహిస్తారు. తుది ఎంపిక 21.3.2024 వరకు స్పోర్ట్స్ స్కూల్ హకీంపేట్ హైదరాబాద్‌లో ఉంటుంది. అర్హత, ఆసక్తి గలవారు 2 పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు, ప్రస్తుతం చదువుతున్న బోనోఫైడ్, ఆధార్ కార్డు జిరాక్స్‌తో ఆదివారం ఎన్‌టీఆర్ మినీ స్టేడియం అచ్చంపేటలో జరిగే ఎంపికకు హాజరు కావాలన్నారు. సమాచారం కోసం సెల్ నం.90106 15106, 79815 25389లను సంప్రదించాలని కోరారు.

# సదావకాశం..



పేటలో పన్ను వసూలు చేస్తున్న మున్సిపల్ అధికారులు, సిబ్బంది

**ఆస్తి పన్ను వడ్డీపై 90 శాతం రాయితీ**

- వన్‌టైం సెటిల్‌మెంట్ పథకానికి శ్రీకారం
- మూడు మున్సిపాలిటీల్లో 6.68 కోట్ల వసూళ్లే లక్ష్యం
- అధికారులు, సిబ్బంది తలమునకలు

నారాయణపేట: పురపాలికల్లోని నివాసగృహాలు, వాణిజ్య సముదాయభవనాలకు 2022–23 ఆర్థిక సంవత్సరానికి గాను పన్నులు చెల్లించని వారిపై పడిన ఆస్తి పన్నులపై వడ్డీలో 90 శాతం మినహాయింపు ఇస్తూ రాష్ట్ర పురపాలకశాఖ ప్రజలకు ఆఫర్ ఇచ్చింది. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను పురపాలకశాఖ ప్రత్యేక కార్యదర్శి ఎం.దానకిషోర్ జీఓ.ఆర్‌టీ.నం 101ను ఫిబ్రవరి 27న జారీ చేశారు. మున్సిపాలిటీల అభివృద్ధికి కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలనుంచి వచ్చే నిధులతో పాటు ఈ పన్నుల రాబడితో పట్టణంలో ప్రగతి పరుగులు తీస్తాయి. దీంతో ఆస్తి పన్నుల వసూలుపై మున్సిపల్ అధికార యంత్రాంగం దృష్టి సారిస్తుంది. 2022–23 ఆర్థిక సంవత్సరానికి గాను ఆస్తి పన్నులు బకాయిలు పడిన వాటిని వడ్డీని రాయితీ నిస్తూ వసూలు చేయడంతో పాటు 2023–24 ఏడాదికి సంబంధించి పన్నుల వసూలు చేయడంలో మున్సిపల్ అధికార యంత్రాంగం జిల్లాలోని నారాయణపేట, మక్తల్, కోస్గి మున్సిపాలిటీల్లో పన్నులు వసూలు చేయడంలో పోటీపడుతున్నారు.

**డిజిటల్ చెల్లింపులకు అవకాశం**

ఇక ఆస్తి పన్ను చెల్లింపు డిజిటల్ లావాదేవీలతో సులభమైంది. ఏటీఎం, డెబిట్, క్రెడిట్ కార్డులు, ఇంటర్‌నేట్ బ్యాంకింగ్, క్యూఆర్ కోడ్, యూపీఐ, గూగూల్‌పే, ఫోన్‌పే ద్వారా నేరుగా ఆ మున్సిపాలిటీ ఖాతాలోకి నేరుగా జమ అవుతాయి. క్యూర్ కోడ్‌ను స్కాన్ చేసి తమ ఇంటి ఆస్తి పన్నులను చెల్లించవచ్చు. మున్సిపల్ శాఖ ప్రత్యేక క్యూర్ కోడ్‌ను ఏర్పాటు చేసింది. ఆక్యూర్ కోడ్‌ను స్కాన్ చేసిన తర్వాత జిల్లా పేరు వస్తుంది ఆ తర్వాత మున్సిపాలిటీని ఎంపిక చేసుకొని ఇంటి నంబర్‌ను టైప్ చేస్తే ఆస్తి పన్ను ఎంత కట్టాలనేది చూయిస్తుంది. ఆ తర్వాత అమౌంట్‌ను పే చేయవచ్చు. మున్సిపల్ సిబ్బందికి గాని.. ఆస్తి పన్ను చెల్లించే వారికి సమయం ఆదాతో పాటు ఇన్‌టైమ్‌లో పన్నులు చెల్లించే వీలవుతుంది.

**వన్‌టైం సెటిల్‌మెంట్ పథకానికి శ్రీకారం**

మున్సిపాలిటీల్లో సాధారణ నిధుల కొరత కారణంగా పారిశుద్ధ్య కార్మికుల వేతనాలు, విద్యుత్ నిర్వహణ భారంగా మారుతుంది. ఆస్తి పన్ను బకాయిలు ఏటా పెరుగుతున్నాయి. ఏళ్ల తరబడి ప్రభుత్వ,ప్రైవేట్ సంస్థల, గృహాలకు సంబంధించి పెరుకుపోయిన బకాయిలను రాబట్టేందుకు వడ్డీ మాఫీ కోసం ఓటీఎస్(వన్ టైం సెటిల్‌మెంట్) పథకానికి శ్రీకారం చుట్టింది.

**సద్వినియోగం చేసుకోండి**



**ఆస్తి పన్ను వడ్డీపై** 90 **శాతం రాయితీని** గృహ, **దుకణాల యాజమా**నులు **సద్వినియోగం చేసు**కోవా**లి. ఈ రాయితీతో** గృహ, **దుకణాల యాజమా**నులకు ఎంతో లబ్ధి చేకూరుతుంది. పెండింగ్ బకాయిలు పూర్తిగా చెల్లించి మున్సిపల్ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరుతున్నాం.

– సునీత,
మున్సిపల్ కమిషనర్, నారాయణపేట

**ముందే వడ్డీ చెల్లించిన వారికి సర్దుబాటు**

ఆర్థిక సంవత్సరం 2022–23 వరకు ఉన్న బకాయిలను 10 శాతం వడ్డీతో ఈ పథకం కింద చెల్లిచంవచ్చని మున్సిపల్‌శాఖ పేర్కొంది. ఒక వేళ బకాయిలను పూర్తి వడ్డీతో ఇప్పటికే చెల్లించి ఇది వరకే చెల్లించి ఉంటే వారికి ఓటీఎస్ వర్తింపజేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. చెల్లించిన వడ్డీలో 90 శాతం వెనక్కు ఇవ్వనుంది. ఈ మొత్తన్ని రాబోయే ఏడాది ఆస్తి పన్ను డిమాండ్‌లో సర్దుబాటు చేసేలా చర్యలు తీసుకోనున్నారు.

**జిల్లా వివరాలిలా..**

| మున్సిపాలిటీ | మొత్తం ఆస్తులు | వసూలు లక్ష్యం | వసూలైంది (రూ.లక్షల్లో) | వసూలైన శాతం |
|---|---|---|---|---|
| కోస్గి | 6,199 | 192.37 | 110.66 | 57.52 |
| మక్తల్ | 7,634 | 181.36 | 94.76 | 57.13 |
| నారాయణపేట | 9,053 | 294.71 | 209.73 | 71.16 |

# పాలమూరుకు తీరని అన్యాయం



కర్వెన రిజర్వాయర్‌ను పరిశీలిస్తున్న ఏఐసీసీ నాయకులు వంశీచంద్‌రెడ్డి, ఎమ్మెల్యేలు మధుసూదన్‌రెడ్డి, పర్ణికారెడ్డి, అనిరుధ్‌రెడ్డి, వాకిటి శ్రీహరి, ఈర్లపల్లి శంకర్, తదితరులు

- బీఆర్‌ఎస్ తొమ్మిదేళ్ల పాలనలో ఒక్క ఎకరాకు సాగునీరు అందించలే
- కాంగ్రెస్ హయాంలోనే అసంపూర్తి ప్రాజెక్టులు పూర్తిచేస్తాం
- ఏఐసీసీ నాయకులు, సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితులు వంశీచంద్‌రెడ్డి
- రిజర్వాయర్లను పరిశీలించిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు

దేవరకద్ర/ జడ్చర్ల: కేసీఆర్‌కు రాజకీయ భిక్ష పెట్టిన పాలమూరు జిల్లాకు తీరని అన్యాయం చేశారని, కుర్చీ వేసుకుని కూర్చొని మూడేళ్లలో పాలమూరు– రంగారెడ్డి ప్రాజెక్టును పూర్తి చేస్తానని చెప్పి తొమ్మిదేళ్లయినా ఒక్క ఎకరాకు నీరివ్వలేదని ఏఐసీసీ నాయకులు, సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితులు వంశీచంద్‌రెడ్డి అన్నారు. శుక్రవారం 'చలో పాలమూరు– రంగారెడ్డి రిజర్వాయర్ల' సందర్శనలో భాగంగా ఎమ్మెల్యేలు జి.మధుసూదన్‌రెడ్డి, పర్ణికారెడ్డి, అనిరుధ్‌రెడ్డి, వాకిటి శ్రీహరి, ఈర్లపల్లి శంకర్, యెన్నం శ్రీనివాస్‌రెడ్డిలతో కలిసి ఆయన కర్వెన, ఉదండాపూర్ రిజర్వాయర్లను పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసి విలేకరుల సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. ఉమ్మడి జిల్లాపై కేసీఆర్ పగ పెట్టుకుని పాలమూరు– రంగారెడ్డి ప్రాజెక్టుపై కక్షసాధింపు ధోరణితో.. ఎక్కడి పనులు అక్కడే వదిలేసి ఎన్నికల ముందు ప్రజలను మోసం చేయడానికి ఒక పంపును ప్రారంభించారని ఆరోపించారు. దక్షిణ తెలంగాణకు మోసం చేసి ఉత్తర తెలంగాణలో కమీషన్లు దండుకున్నారని దుయ్యబట్టారు. రూ.లక్షల కోట్లు వెచ్చించి కట్టిన ప్రాజెక్టులు నాణ్యత లేకుండా తయారయ్యావని, కాళేశ్వరంలో వచ్చిన పగుళ్లే ఇందుకు నిదర్శనమన్నారు. పదేళ్లు ప్రజలను మోసం చేసిన బీఆర్‌ఎస్‌ను అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు ఛీకొట్టినా.. మళ్లీ మోసం చేయడానికి చలో మేడిగడ్డ పేరుతో కొత్త డ్రామాలు ఆడుతున్నారని విమర్శించారు. ప్రజలను మోసం చేసిన బీఆర్‌ఎస్ నాయకులకు ప్రజలే మరోసారి బుద్ధి చెబుతారన్నారు. ఇటీవల నల్లగొండ సభలో 80 శాతం పనులు పూర్తి చేశామని కేసీఆర్ చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. రిజర్వాయర్లకు సంబంధించి కేవలం 20– 30 శాతమే పూర్తయ్యాయని, ఇంకా లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ ఊసే లేదన్నారు. ఉమ్మడి జిల్లాలో ఎక్కడైనా నీళ్లు పారుతున్నాయంటే దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి పుణ్యమే అన్నారు. మళ్లీ తమ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే ప్రాజెక్టు పెండింగ్ పనులు పూర్తి చేసి నీళ్లందిస్తామని చెప్పారు.

**299 టీఎంసీలేనా..?**

కృష్ణానదిలో మనకు రావాల్సిన వాటాను సాధించలేని అసమర్థుడు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అని వంశీచంద్‌రెడ్డి విమర్శించారు. కృష్ణా బేసిన్‌లో 68.5 శాతం క్యాచ్‌మెంట్ ఉంటే ఉమ్మడి రాష్ట్రానికి కేటాయించిన 812 టీఎంసీలలో 577 టీఎంసీలు మనకు దక్కాల్సి ఉండగా.. కేవలం 299 టీఎంసీలకే ఒప్పుకొన్నారని ఆరోపించారు. మనకు కేటాయించిన 299 టీఎంసీలలోనూ 212 టీఎంసీలే వాడుకుంటున్నామని వచ్చిన వాటాను కూడా సరిగా వాడుకోకపోవడంతో ఆంధ్ర వాళ్లు నీటిని మళ్లించుకుపోతున్నారని పట్టించుకోవడం లేదని దుయ్యబట్టారు.

ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ కేసీఆర్ ధన, అధికార దాహానికి పాలమూరు జిల్లా కృంగి, కృషించి పోయిందన్నారు. పాలమూరు, కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతిపై న్యాయ విచారణ జరగాలని డిమాండ్ చేశారు. కేసీఆర్‌కు తగు రీతిలో గుణపాఠం చెప్పేందుకు పాలమూరు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు.

ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి సొంత నియోజకవర్గంలోని ఉదండాపూర్ వదిలి.. మేడిగడ్డకు ఎందుకు వెళ్లారని ప్రశ్నించారు. దమ్ముంటే వారందరిని తీసుకుని ఉదండాపూర్ వస్తే.. ఇక్కడ జరిగిన అవినీతి, అక్రమాలు, నిర్వాసితుల సమస్యల పరిష్కారం ఎందుకు చేయలేదో చెప్పాలని డిమాండ్ చేశారు. నిర్వాసితుల సమస్యలపై తాను ప్రతిపక్ష నేతగా పోరాడానని గుర్తు చేశారు. నిర్వాసిత రైతులకు సంబంధించి ఆర్అండ్ఆర్ ప్యాకేజీ పెంపు కోసం ఈ నెల 6న జిల్లాకు వస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేసేందుకు కృషి చేస్తానన్నారు.

# ఇంటర్, పది పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

- పరీక్ష కేంద్రాల్లో సెల్‌ఫోన్ అనుమతించొద్దు
- కలెక్టర్ కోయ శ్రీహర్ష

నారాయణపేట: పరీక్షా కేంద్రాలకు ఎవరు సెల్‌ఫోన్ తీసుకొని రావద్దని మరోసారి స్పష్టం చేస్తూ ప్రతి పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్‌లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, రాష్ట్ర స్థాయి ఉన్నత అధికారులు నిర్వహించిన వీసీ తర్వాత జిల్లా అధికారులతో కలెక్టర్ మాట్లాడారు. ఇంటర్, పదవ తరగతి పరీక్షలు జిల్లాలో సమర్థవంతంగా జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని ఎక్కడా ఏ చిన్న పొరపాటు జరగవద్దన్నారు.

**లబ్ధిదారుల ఎంపికకు మార్గదర్శకాలు**

ప్రభుత్వం మరో రెండు గ్యారంటీ పథకాల అమలుకు శ్రీకారం చుట్టిందని, రూ.500లకే గ్యాస్ సిలిండర్ 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ సరఫరా పథకాలను అమలు చేస్తుందని, ఇందుకోసం లబ్ధిదారుల ఎంపికకు మార్గదర్శకాలు జారీ చేసిందన్నారు. తెల్ల రేషన్‌కార్డు, ఆధార్ సంఖ్య, గ్యాస్ కనెక్షన్ నంబర్, విద్యుత్ మీటర్ నంబర్ ప్రజాపాలన దరఖాస్తులో సమర్పించిన వారందరికి పథకాలు అమలు అవుతాయన్నారు. ఇప్పటి వరకు సదరు సమాచారం ప్రజాపాలన దరఖాస్తుల్లో సమర్పించని వారు ప్రజా పాలన సేవా కేంద్రాల్లో తమ వివరాలు అప్‌డేట్ చేసుకునే విధంగా చర్యలు చేపట్టాలని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో జడ్పీసీఈఓ శైలజా,డీఈఓ అబ్దుల్ ఘనీ, డీఎస్పీ లింగయ్య, డీఐఓ రియాజ్ హుస్సేన్ పాల్గొన్నారు.

**శాఖాపరమైన ప్రగతిపై ప్రత్యేక దృష్టి**

శాఖాపరంగా కొనసాగే ప్రగతి పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ సూచించారు. కలెక్టర్ తన చాంబర్‌లో వ్యవసాయశాఖ, పశుసంవర్ధకశాఖ, మత్స్యసహకార శాఖ జిల్లా అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడారు. శాఖ పరమైన ప్రగతి పనులు, నిర్దేశించిన లక్ష్యాలపై సమీక్షించారు. శాఖల వారీగా జరిగే అభివృద్ధి పనులు, చేయాల్సిన పనులపై సంబంధిత అధికారులతో చర్చించి, నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో వ్యవసాయశాఖ, మత్స్యశాఖ, హార్టికల్చర్, పశుసంవర్ధక శాఖ జిల్లా అధికారులు ఉన్నారు.

**115మంది గైర్హాజరు**

నారాయణపేట రూరల్: ప్రశాంత వాతావరణంలో ఇంటర్ పరీక్షలు కొనసాగుతున్నాయి. శుక్రవారం మొదటి సంవత్సరం విద్యార్థులకు ఇంగ్లీష్ పరీక్ష నిర్వహించగా.. దీనికి జిల్లా వ్యాప్తంగా 4232 మంది రెగ్యులర్ విద్యార్థులకు 4047మంది హాజరయ్యారు. 185మంది విద్యార్థులు గైర్హాజరు అయ్యారు. అదేవిధంగా 596మంది ఒకేషనల్ విద్యార్థులకు గాను 566మంది పరీక్ష రాయగా 30మంది గైర్హాజరయ్యారు. కలెక్టర్ శ్రీహర్ష ఊట్కూర్ పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేసి నిర్వాహకులకు సూచనలు చేశారు. జిల్లా తనిఖీ బృందం అధికారులు మద్దూర్, దామరగిద్ద, నారాయణపేటలో పర్యటించగా, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం ఊట్కూర్, ధన్వాడ, మరికల్, సిట్టింగ్ స్క్వాడ్ మద్దూర్, ధన్వాడ కేంద్రాలు పరిశీలించారు.

**వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు**

ఊట్కూరు: ఆయా గ్రామాల్లో వేసవి కాలంలో నీటి ఎద్దడి లేకుండా తగు చర్యలు చేపట్టాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. శుక్రవారం ఊట్కూరు మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో ఉపాధి హామీలో నాటిన మొక్కలు ఎండిపోకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని, వేసవి కాలం ఉన్నందున ఉపాధి హామీ పథకంలో కూలీలను పెంచి పనులు చేయించాలని వారికి ప్రతి వారం వారి ఖాతాలో డబ్బులు జమ అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. తాగునీటి పైపులు లీకేజీ లేకుండా జాగ్రత్త పడాలని గ్రామ కార్యదర్శులకు సూచించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగుతున్న ఇంటర్ పరీక్షా కేంద్రాన్ని ఆయన తనిఖీ చేసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఓ రాజేశ్వరీ, ఎంపిడిఓ ధనుంజయ గౌడ్, తహసిల్దార్ మమత, అధికారులు కొండన్న, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# 'గృహజ్యోతి'కి కోడ్ అడ్డంకి

- ఉమ్మడి జిల్లాలో స్థానిక ఎమ్మెల్సీ ఎన్నిక కోడ్ కారణంగా యథావిధిగా విద్యుత్ బిల్లులు
- ఉచిత విద్యుత్‌కు మూడు నెలలు బ్రేక్ పడే అవకాశం
- నిరాశలో లబ్ధిదారులు



కరెంట్‌బిల్లును స్కాన్‌చేస్తున్న సిబ్బంది

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): జిల్లాలో ఉచిత కరెంట్ పథకం అమలుకు ఎన్నికల కోడ్ అడ్డంకిగా మారింది. ఫిబ్రవరి 27వ తేదీన స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్‌ను ఎన్నికల సంఘం విడుదల చేసింది. దీంతో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. దీంతో ప్రభుత్వ కొత్త పథకాలు అమలు చేసేందుకు వీలు లేకుండాపోయింది. ఉచిత బస్సు ప్రయాణం చేసే వారికి జీరో టికెట్లు ఇస్తున్నట్లుగానే ఇక నుంచి 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకానికి కూడా జీరో బిల్లును ఇచ్చేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఉమ్మడి జిల్లాలో ఎన్నికల కోడ్ ఉన్నందున ప్రభుత్వం ఇచ్చే ప్రక్రియకు విద్యుత్‌శాఖ శ్రీకారం చుట్టింది.

**రీఫండ్ అయ్యేనా?**

ఇతర జిల్లాలో పథకం అమలుతో లబ్ధిదారులు సంతోషంగా ఉంటే మన ఉమ్మడి జిల్లాలో మాత్రం పథకం అమలు కాక లబ్దిదారులు నిరాశలో పడ్డారు. కోడ్ ఉండే మూడు నెలలు బిల్లులు ఉమ్మడి జిల్లా ప్రజలు కట్టాల్సిందేనని తెలుస్తుంది. ఈ మూడు నెలల బిల్లులను ఎలా రీఫండ్ చేస్తారో తెలియని పరిస్థితిలో విద్యుత్ శాఖ అధికారులు ఉన్నారు.

**మూడు నెలల పాటు బ్రేక్?**

ఉమ్మడి జిల్లాలో ఎమ్మెల్సీ కోడ్ అమలులో ఉంది. ఫిబ్రవరి 27వ తేదీన ఎన్నికల సంఘం ఎన్నిక షెడ్యూల్‌ను విడుదల చేసింది. మార్చి 28వ తేదీన ఎన్నికలు జరుగుతాయి. ఏప్రిల్ 2న ఓట్ల లెక్కింపు చేస్తారు. ఇది నడుస్తుండగానే లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ కూడా మరో వారం పది రోజుల్లో వచ్చే అవకాశాలు ఉన్నాయి. ఈ ఎన్నికల కోడ్ మే నెల వరకు ఉండే అవకాశాలు ఉన్నాయి. దీంతో మరో మూడు నెలల పాటు ఉచిత కరెంట్ పథకానికి బ్రేక్ పడే అవకాశం ఉంది. ఇతర జిల్లాలో ఈ పథకం కొనసాగుతుంటుంది. కానీ పాలమూరు జిల్లాలో మాత్రం కోడ్ కారణంగా పథకం అమలుకు నోచుకోకపోవడంతో లబ్ధిదారులు నిరాశలో పడ్డారు.

**ఎన్నికల కోడ్‌తో పథకానికి బ్రేక్..**




ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా స్థానిక సంస్థ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉంది. దీంతో కొత్త పథకాలు అమలు చేసేందుకు వీలు లేదు. ఎన్నికల కోడ్ ఉన్నంత వరకు ఉమ్మడి జిల్లాలో విద్యుత్ బిల్లులు యథావిధిగా వస్తాయి. ఈ రోజు కొంతమందికి జీరో బిల్లులు ఇచ్చినా.. వాటిని స్థానంలో తిరిగి యథావిధిగా బిల్లులు ఇస్తాం. జిల్లావ్యాప్తంగా అందరికీ గత నెల మాదిరిగానే బిల్లులు వస్తాయి. ఈ విషయాన్ని ప్రజలు గమనించాలి.

– వెంకటరమేష్, ఎస్‌ఈ ట్రాన్స్‌కో

# మెగా డీఎస్సీ పేరుతో దగా..

- దేశంలో కులగణన ఎందుకు చేపట్టడం లేదో చెప్పాలి
- బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్



మాట్లాడుతున్న బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్

కల్వకుర్తి టౌన్: ప్రజాపాలన అందిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. ప్రభుత్వం అందుకు విరుద్ధంగా పాలన సాగిస్తుందని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సన్నాహక సమావేశంలో పాల్గొని.. విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఉద్యోగాలు కల్పిస్తామన్న వారు గతంలో వేసిన ఉద్యోగాలకు అదనంగా కొన్నింటిని మాత్రమే కలిపి మెగా డీఎస్సీ పేరుతో నిరుద్యోగులను దగా చేస్తుందని ఆరోపించారు. ఇటీవల విడుదల చేసిన టీజీటీ, పీజీటీ, లెక్చరర్ల ఫలితాలు ప్రకటించిన ప్రభుత్వం, ఫలితాల్లో ఒక్కో అభ్యర్థి రెండు, మూడు ఉద్యోగాలు సాధించారు. ఉద్యోగాలు సాధించిన వారు ఏదో ఒక్క దానిలోనే చేరే అవకాశం ఉండటంతో మళ్లీ 1,500 వరకు బ్యాక్‌లాగ్ పోస్టులు ఏర్పడే ప్రమాదం ఉందన్నారు. ఒక్కో నియామకాన్ని విడివిడిగా చేపడితే చాలామంది నిరుద్యోగులకు న్యాయం చేకూరుతుందని వివరించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి తన సొంత నియోజకవర్గానికి మాత్రమే నిధులు ఇస్తున్నారని, అదేవిధంగా ఇతర నియోజకవర్గాలకు సైతం నిధులను కేటాయించాలని డిమాండ్ చేశారు. దేశంలో రాజ్యాంగం చాలా ప్రమాదంలో ఉందని, రాజ్యాంగాన్ని బీజేపీ కూనీ చేస్తుందని మండిపడ్డారు. దేశంలో కులగణన చేయాల్సి ఉన్నా.. బీజేపీ ప్రభుత్వం ఇప్పటి వరకు ఎందుకు దానిపై మాట్లాడటం లేదని ప్రశ్నించారు. కేంద్ర ఎన్నికల సంఘం స్వయంప్రతిపత్తిని కేంద్రం ప్రత్యేక చట్టం చేసి అందులో సైతం దూరిందని విమర్శించారు. బీజేపీ కేవలం మతతత్వ రాజకీయాలను ప్రోత్సహిస్తుందని, దేశంలో బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి దుర్మార్గాలు పెరిగిపోయాయని అన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన పదేళ్లలో ఇప్పటి వరకు ఒక్క ప్రెస్ కాన్ఫరెన్స్ ఎందుకు పెట్టలేదని నిలదీశారు. బీజేపీ మళ్లీ కేంద్రంలో అధికారంలోకి వస్తే ప్రజలపై దాడులు పెరగడంతోపాటు.. ప్రజలకు స్వేచ్ఛ, సమానత్వం అన్ని పోతాయన్నారు. సమావేశంలో నాయకులు ఆంజనేయులు, కేశవరావు, విజయ్, చందు, యోసేపు, నాగన్న, వెంకటయ్య, పృథ్వీరాజ్ పాల్గొన్నారు.

# ఉద్యోగాల జాక్‌పాట్

- పలువురికి స్ఫూర్తినిస్తున్న అభ్యర్థులు
- ఒక్కొక్కరు మూడు, నాలుగు ఉద్యోగాలు సాధించిన వైనం
- లక్ష్య ఛేదనకు నిరంతరం శ్రమ

**గద్వాల అర్బన్:** ప్రభుత్వ కొలువు సాధించాలనేదే వారి లక్ష్యం. అనుకున్న లక్ష్యం కోసం పట్టువిడవకుండా ముందుకెళ్లారు. లక్ష్యానికి మించి.. అన్నట్లుగా ఏకంగా ఒకేసారి రెండు, మూడు, నాలుగేసి కొలువులు సాధించారు. ప్రస్తుత పోటీ సమాజంలో ఒక ప్రభుత్వ ఉద్యోగం సాధించడమే మహా గగనం. అలాంటిది కృషి, పట్టుదలతో ఏదైనా సాధించవచ్చనేది నిరూపించి స్ఫూర్తిదాయకంగా నిలిచారు. తాజాగా ప్రభుత్వం విడుదల చేసిన గురుకుల టీజీటీ, పీజీటీ, జూనియర్ లెక్చరర్ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఉమ్మడి జిల్లాలో ఉద్యోగాలు సాధించిన కొందరి ప్రిపరేషన్ విధానం, విజయగాథలు, మూడు, నాలుగేసి ఉద్యోగాలు సాధించడంపై వారి ఆనందోత్సాహం తదితర అంశాలపై 'సాక్షి' ప్రత్యేక కథనం.

## కష్టపడితే విజయం వరిస్తుందనే నమ్మకంతో..



ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనే తపనతో బీపెడ్, బీఎడ్ పూర్తి చేశారు. ఎలాంటి కోచింగ్ లేకుండా ఇంట్లో ఉండే చదివాను. ఎంతో మంది ఎన్నో మాటలు అన్నా.. నేను నా లక్ష్యాన్ని విడువలేదు. కష్టపడితే తప్పనిసరిగా విజయం వరిస్తుందనే నమ్మకంతో ముందుకెళ్లాను. 2012 డీఎస్సీలో క్వాలిఫై కాలేదు. 2017లో డీఎస్సీ, గురుకుల పరీక్షలు రాశాను. మళ్లీ కరోనా తర్వాత తెలుగుభాషను ఎంచుకున్నాను. 2021లో తెలుగులో సెట్, 2023లో నెట్‌లో క్వాలిఫై అయ్యాను. 2023 ఆగస్టులో టీజీటీ నోటిఫికేషన్ వచ్చింది. ఈ కొలువుకు సంవత్సరం పాటు చదివాను. పెద్దల సలహాలతో ముందుకెళ్తూ.. 1:2 పద్ధతిలో టీజీటీ, జేఎల్ క్వాలిఫై అయ్యాను. అయితే పీజీటీలో ఒక్క మార్కుతో డిస్‌క్వాలిఫై అయ్యాను. దీంతో కొంత నిరుత్సాహపడ్డాను. అయితే జేఎల్ డెమోలో ఉత్తమ ప్రతిభ కనబర్చి క్వాలిఫై అయ్యాను. తాజాగా విడుదలైన టీజీటీ ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో 55వ ర్యాంకు సాధించాను. చాలా సంతోషంగా ఉంది. నా విజయానికి కుటుంబ సభ్యులు ఎంతో సహకరించారు.

– కబులాసాబ్, మానవపాడు మండలం, అమరవాయి

## చదువంటే ఇష్టంతో నాలుగు ఉద్యోగాలు..



మాది మానవపాడు మండలం కేంద్రం. ప్రస్తుతం మియాపూర్‌లో నివాసం ఉంటున్నాం. నాకు చిన్నప్పటి నుంచే చదువంటే చాలా ఇష్టం. మా తల్లిదండ్రుల ఆశయం నెరవేర్చాలని ప్రభుత్వ కొలువు సాధించేందుకు నిరంతరం చదివాను. నిజాం కళాశాలలో డిగ్రీ, ఉస్మానియా యూనివర్సిటీలో బీఈడీ పూర్తి చేశాను. ఇటీవల విడుదలైన జేఎల్, గురుకుల పీజీటీ, ఏకలవ్య మోడల్ స్కూల్ టీచర్, గురుకుల కళాశాల అధ్యాపక ఉద్యోగాలు సాధించాను. నా విజయంలో తల్లిదండ్రులతో పాటు నా భర్త సహకారం ఉంది. ఒకేసారి నాలుగు ఉద్యోగాలు సాధించడం చాలా ఆనందంగా ఉంది.

– దీపారెడ్డి

## ప్రైవేటు ఉద్యోగం చేస్తూనే పోటీ పరీక్షలకు..



మా ఊరు అక్షరాస్యతలో అత్యంత వెనుకబడిన ప్రాంతం. సరైన రవాణా సౌకర్యం, ఇతర వసతులు లేనప్పటికీ ఉన్నత స్థానాల్లో ఉండాలనే లక్ష్యంతో కష్టపడి చదివాను. మల్టీజోన్ క్యాడర్‌లో ఎంతో పోటీ ఉన్న పరిస్థితుల్లో జేఎల్(ఎకనామిక్స్)లో రాష్ట్రస్థాయిలో 6వ ర్యాంకు రావడం ఎంతో సంతోషంగా ఉంది. మహాత్మా గాంధీ యూనివర్సిటీలో 2013–15 విద్యాసంవత్సరంలో పీజీలో అప్పటి గవర్నర్ నర్సింహన్ చేతుల మీదుగా గోల్డ్‌మెడల్ అందుకున్నాను. ప్రైవేటు ఉద్యోగం చేస్తూనే కష్టపడి పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యాను. ప్రస్తుతం జడ్చర్లలోని ప్రభుత్వ కళాశాలలో గెస్ట్ ఫ్యాకల్టీగా విధులు నిర్వహిస్తున్నాను. నేను గురుకుల డిగ్రీ, జూనియర్, పీజీటీ, టీజీటీ ఉద్యోగాలకు అర్హత సాధించాను. అయితే అందులో గురుకుల జేఎల్, పీజీటీ ఉద్యోగాలకు అపాయింట్ ఆర్డర్ తీసుకున్నాను.

– రాఘవేంద్ర, గట్టు

## ఓపిక, పట్టుదలతో సాధించా...



మా సొంత గ్రామం వీరాపురంలో ప్రైమరీ పాఠశాల, 6 నుంచి 10వ తరగతి వరకు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో చదివాను. ఎంఏఎల్‌డీ కళాశాలలో ఇంటర్మీడియట్, డిగ్రీ విద్యను పూర్తి చేశాను. పీజీ, బీఈడీ ఉస్మానియా యూనివర్సిటీలో చదివాను. ప్రభుత్వ విద్యాసంస్థల్లోనే విద్యను పూర్తి చేశాను. ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనే ఉద్దేశంతో ముందుకెళ్లాను. రెండేళ్లుగా ఉద్యోగాలకు సన్నద్ధమవుతున్నాను. అందుకు మా కుటుంబ సభ్యులు చాలా ప్రోత్సహించారు. ఈ క్రమంలోనే టీజీటీ, పీజీటీ, జూనియర్ లెక్చరర్ ఉద్యోగాలకు ఎంపికయ్యాను. రాష్ట్రస్థాయిలో పీజీటీలో 2వ ర్యాంకు, జేఎల్‌లో 15వ ర్యాంకు సాధించాను. ఇష్టపడి సెలబస్‌ను తెలుసుకుని చదివితే ఏ ఉద్యోగమైన సాధించవచ్చు. ఓపిక, పట్టుదల ఉండాలి.

– రామకృష్ణ, గద్వాల మండలం, వీరాపురం

## ఆడపిల్లకు ఉన్నత చదువులెందుకు అన్నారు..



నాకు చదువంటే ఇష్టం. నేను చదువుకుంటుంటే ఆడపిల్లకు ఉన్నత చదువులెందుకు అన్నారు. ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనే లక్ష్యంతో ఎంతో కష్టపడి చదువుకున్నాను. ఐదో తరగతి వరకు సొంత గ్రామం గద్వాల జిల్లా, మానవపాడు మండలం జల్లపురంలో, ఆరు నుంచి పది వరకు కేజీబీవీలో, ఇంటర్ వనపర్తి స్కాలర్స్, డిగ్రీ గాయత్రి డిగ్రీ కాలేజీ, పీజీ ఉస్మానియా యూనివర్సిటీలో పూర్తి చేశాను. ముందు టీజీటీ, పీజీటీలో ఉద్యోగం సాధించాను. ఆ తర్వాత ఫిబ్రవరి 29న ప్రభుత్వం ప్రకటించిన ఫైనల్ లిస్టులో జేఎల్‌లో ఉద్యోగం వచ్చింది. భర్త శివకుమార్ సహకారం, తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే ఈ ఘనత సాధించా. చిన్నప్పుడు చదువు వద్దన్న వారే ఇప్పుడు గ్రేట్ అంటున్నారు.

– శ్వేత, గోపాల్‌పేట మండలం, పొలికెపాడు

## ఇంట్లో ఉండే ప్రిపేర్ అయ్యా



నేను ఎంఎస్సీ బీఈఎడ్ చదివాను. ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనే లక్ష్యంతో నోటిఫికేషన్ కంటే ముందు నుంచే ఇంట్లో ఉండి ప్రిపరేషన్ మొదలుపెట్టాను. నాకు డిగ్రీ నుంచే బోటనిపై ఎక్కువ మక్కువ ఉండేది. బీఎడ్‌లో రాష్ట్రస్థాయిలో 8వ ర్యాంకు, ఎమ్మెస్సీ ఎంట్రెన్స్‌లో రాష్ట్రస్థాయిలో 9వ ర్యాంకు సాధించా. 2022లో ఎమ్మెస్సీ పూర్తి చేశాను. గురుకుల నోటిఫికేషన్ రాగా.. తల్లిదండ్రులు, ప్రొఫెసర్ల సహకారంతో శ్రద్ధగా చదివాను. పీజీటీలో రాష్ట్రస్థాయి లో 19వ ర్యాంకు, గురుకుల ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో 83వ ర్యాంకు సాధించాను.

– సుమయ్య తస్లీమ్, గద్వాల

## నిరంతర సాధన ఉండాలి..



సంకల్పబలం, పట్టుదల, నిరంతర సాధన ఉంటే దేనినైనా సాధించవచ్చు. మాది సామాన్య మధ్యతరగతి రైతు కుటుంబం. నేను అలంపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివాను. ఇంటర్, డిగ్రీ, బీఎడ్ వనపర్తిలో, ఎమ్మెస్సీ(భౌతిక శాస్త్రం) ఉస్మానియా విశ్వవిద్యాలయం హైదారబాద్‌లో పూర్తి చేశాను. పట్టుదలతో జేఎల్, పీజీటీ, టీజీటీలో మూడు ఉద్యోగాలు సాధించా.

– రాఘవేంద్ర, అలంపూర్ మండలం, కాశీపూర్

## రాష్ట్రస్థాయిలో ర్యాంకులు



**నారాయణపేట రూరల్:** మండలంలోని అప్పక్‌పల్లికి చెందిన డాక్టర్ రామనోళ్ల గోవింద్‌రెడ్డి తన ప్రతిభతో ఒకేసారి మూడు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాడు. గురుకుల ఉద్యోగ ఫలితాల్లో మూడు విభాగాల్లో పరీక్షలు రాసి విజయం సాధించాడు. పీజీటీ కెమిస్ట్రీలో రాష్ట్రస్థాయి 22వ ర్యాంకు, ఫిజిక్స్‌లో రాష్ట్రస్థాయిలో 38వ ర్యాంకు సాధించాడు. అలాగే టీజీటీలోనూ ఎంపికయ్యాడు. పాఠశాల విద్యను పూర్తిగా సర్కారు స్కూళ్లలో చదివిన ఆయన ఇంటర్, డిగ్రీ, బీఈటీ ప్రైవేట్ కళాశాలల్లో పూర్తి చేశారు. పీజీ ఉస్మానియా యూనివర్సిటీలో, గేట్ అర్హతతో సీఎస్ఐఆర్– ఐఐసీటీ హైదరాబాద్‌లో, ఆర్ఎంఐటీ ఆస్ట్రేలియాలో ఫెలోషిప్ పొంది మూడేళ్ల పాటు పీహెచ్‌డీ పూర్తి చేశాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన విజయానికి తల్లిదండ్రులు వెంకటమ్మ, నర్సింహారెడ్డితోపాటు అన్న సుధాకర్‌రెడ్డి కారణమని, వారికి కృతజ్ఞతలు తెలిపారు.

– రామనోళ్ల గోవింద్‌రెడ్డి

## పట్టుదలతో సాధించా..



ఈ మధ్య కాలంలో రైల్వేలో ప్రభుత్వ ఉద్యోగం వచ్చింది. అయినా పట్టువదలకుండా ఉన్నత ఉద్యోగం సాధించాలనే పట్టుదలతో చదివాను. గురుకుల ఫలితాల్లో జెఎల్, పీజీటీ, టీజీటీలో మూడు ఉద్యోగాలు సాధించా.

– భీమవరం, శ్రీనివాస్‌రెడ్డి

## ఒకేసారి నాలుగు ఉద్యోగాలు..



**కోడేరు:** మండలంలోని మైలారం గ్రామానికి చెందిన పస్పునూరి నర్సింహస్వామి ఒకేసారి నాలుగు ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపికయ్యాడు. గ్రామానికి చెందిన పార్వతమ్మ, బాలయ్యకు చెందిన పెద్దకుమారుడు నర్సింహస్వామి. తండ్రి అనారోగ్యంతో గతంలోనే మృతిచెందాడు. ఎలాంటి ఆధారం లేకపోవడంతో కుటుంబ పోషణ భారమై హైదరాబాద్ వలస వెళ్లి మెకానిక్ పనులు చేశాడు. ప్రభుత్వ ఉద్యోగం సాధించాలన్న పట్టుదలతో ముందుకు సాగాడు. పీజీటీ ఆంగ్లంతోపాటు తాజాగా వెలువడిన జూనియర్ లెక్చరర్, ఆంగ్లంలో ఉద్యోగం సాధించాడు.

# వైభవంగా తిక్కవీరేశ్వరస్వామి రథోత్సవం



రథోత్సవానికి తరలివచ్చిన భక్తులు

### వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తులు



రథంపై తిక్కవీరేశ్వరస్వామి ఉత్సవ విగ్రహం

**అయిజ:** మండల కేంద్రంలోని తిక్కవీరేశ్వరస్వామి ఆలయ ఉత్సవాల్లో భాగంగా గురువారం అర్ధరాత్రి రథోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా రథాన్ని రంగురంగుల పూలు, మామిడి తోరణాలు, విద్యుద్దీపాలతో అలంకరించారు. స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని అందంగా అలంకరించి రథంపై ఉంచి సంప్రదాయబద్ధంగా కుంభం, కాగు తెచ్చి రథం చుట్టూ పొలిచల్లి ప్రత్యేక పూజల అనంతరం ముందుకు కదిలించారు. మేళ తాళాలు, మంగళ వాయిద్యాలు, బాణసంచా కాల్పులతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. ఊరేగింపులో యువకుల పలకలు, కట్టెల కోలాటం ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. భక్తులు రథాన్ని పెద్ద ఆంజనేయస్వామి ఆలయం వరకు లాగి తెల్లవారుజామున తిరిగి ఆలయానికి తీసుకొచ్చారు. రథోత్సవానికి తెలంగాణ, కర్ణాక, ఆంధ్రప్రదేశ్ నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. అదేవిధంగా నందికోళ్ల సేవ నిర్వహించారు. ఉత్సవాల సందర్భంగా శుక్రవారం ఆలయ ప్రాంగణంలో ఇసుక సంచి ఎత్తడం, సందెరాళ్లు ఎత్తడం, దొబ్బడగుండ్లు ఎత్తడం పోటీలను ఉత్సవ కమిటీ నిర్వహించింది. రాత్రి ఆలయ ప్రాంగణంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

# హక్కుల సాధనకు ఏకమవుదాం

### ఎంపీటీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గడీల కుమార్‌గౌడ్



మాట్లాడుతున్న సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గడీల కుమార్‌గౌడ్

**జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్):** హక్కుల సాధన కోసం ఎంపీటీసీలమంతా ఏకమవుదామని.. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నిక బరిలో ఉమ్మడి జిల్లా నుంచి ఎంపీటీసీ అభ్యర్థిని బరిలో నిలబెడుదామని తెలంగాణ ఎంపీటీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గడీల కుమార్‌గౌడ్ కోరారు. శుక్రవారం స్థానిక వీవీ కన్వెన్షన్ హాల్‌లో సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ అధ్యక్షతన జరిగిన సంఘం ఉమ్మడి జిల్లా కార్యవర్గ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఎంపీటీసీ సభ్యులు ఎలాంటి విధులు, నిధులు లేకుండా కేవలం ఉత్సవ విగ్రహాలుగా మిగిలిపోయారన్నారు. ప్రభుత్వాలు తమను ప్రజాప్రతినిధులుగా చూడటం లేదని, త్వరలో తమ పదవీ కాలం ముగుస్తుందని ఈ సమయంలో ఉమ్మడి జిల్లా స్థానిక సంస్థల ఎన్నిక వచ్చిందని చెప్పుకొచ్చారు. ఈ ఎన్నికల్లో ఎంపీటీసీల ఆత్మగౌరవం నిలబడేలా ఎంపీటీసీల సంఘం నుంచి ఒకరిని బరిలో నిలుపనున్నట్లు తెలిపారు. గతంలో జిల్లా నుంచి నామినేషన్లు వేస్తే అధికార పార్టీ నాయకులు బెదిరించి విత్‌డ్రా చేయించారని.. మన ఓటును మనమే వేసుకొని చట్టసభల్లో తమ హక్కుల సాధన కోసం గళం విప్పుదామని పిలుపునిచ్చారు. ప్రతి ఎంపీటీసీకి అభివృద్ధి నిధులు ఏటా రూ.20 లక్షల చొప్పున బడ్జెట్‌లో పెట్టాలని, గ్రామపంచాయతీ సర్వసభ్య సమావేశంలో గౌరవ స్థానం కల్పించేలా ఆదేశాలు జారీ చేయాలన్నారు. స్థానిక సంస్థల నుంచి ఎన్నుకోబడిన ఎమ్మెల్సీ నిధులు మండల పరిషత్తులకే మంజూరయ్యేలా మార్గదర్శకాలు విడుదల చేయాలని కోరారు. ప్రతి సభ్యుడికి నెలకు రూ.15 వేల గౌరవ వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వివిధ జిల్లాల అధ్యక్షులు కృష్ణ, వీరాంజనేయరెడ్డి, సుబ్బయ్యయాదవ్, మంగి విజయ్, శ్రీనివాస్‌గౌడ్, కదిరె శేఖర్‌రెడ్డి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# యువత అవకాశాలను అందిపుచ్చుకోవాలి




మాట్లాడుతున్న వీసీ లక్ష్మీకాంత్‌రాథోడ్

**మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్:** యువత ఉద్యోగ, ఉపాధి అవకాశాల్ని అందిపుచ్చుకుని జీవితంలో ఉన్నతంగా ఎదగాలని పీయూ వీసీ లక్ష్మీకాంత్‌రాథోడ్ సూచించారు. ఈ మేరకు పీయూ లైబ్రరీ ఆడిటోరియంలో పీయూ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోటీ ప్రపంచంలో ప్రతి క్షణం విద్యార్థులకు చాలా విలువైనదని, సమయాన్ని పూర్తిగా వినియోగించుకునే వారు జీవితంలో ఉన్నతంగా ఎదుగుతారన్నారు. ప్రభుత్వం ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇచ్చిన నేపథ్యంలో కష్టపడి చదవాల్సిన అవసరం ఉందన్నారు. పీయూ స్టడీ సర్కిల్‌లో గతంలో శిక్షణ తీసుకున్న విద్యార్థులు ఇక్కడి నుంచి ఉద్యోగులుగా వెళ్లారని, అదే స్ఫూర్తితో ప్రస్తుతం చదువుతున్న విద్యార్థులకు కూడా కష్టపడి చదివి ఉద్యోగాలు సాధించాలని సూచించారు. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే వారి కోసం మ్యాగజైన్లు, స్టడీ మెటీరియల్, కరెంట్ ఎఫైర్స్ పుస్తకాలు అందుబాటులో ఉంచుతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ చంద్రకిరణ్, ఐక్యూఏసీ డైరెక్టర్ కిషోర్, కంట్రోలర్ రాజ్‌కుమార్, కన్వీనర్ భూమయ్య, బషీర్ అహ్మద్, అర్జున్‌కుమార్ పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### పరీక్షలు సరిగా రాయలేదని యువకుడి బలవన్మరణం

**నాగర్‌కర్నూల్ క్రైం:** ఇంట్లో ఉరివేసుకుని యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన నాగర్‌కర్నూల్ మున్సిపాలిటీ పరిధిలోని ఉయ్యాలవాడలో చోటుచేసుకోగా శుక్రవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్ఐ గోవర్ధన్ తెలిపిన వివరాల ప్రకారం... ఉయ్యాలవాడకి చెందిన కార్తీక్ (21) హైదరాబాద్‌లోని హయత్‌నగర్‌లోని ఓ కళాశాలలో ఇంజినీరింగ్ సెకండియర్ చదువుతున్నాడు. మొదటి సెమిస్టర్ పరీక్షలు రాసి ఫిబ్రవరి 24న ఇంటికి వచ్చాడు. తల్లిదండ్రులు గురువారం రోజు శంషాబాద్ వెళ్లగా కార్తీక్ ఇంట్లో ఒక్కడే ఉండిపోయాడు. సాయంత్రం తల్లిదండ్రులు ఎన్నిసార్లు ఫోన్ చేసినా ఎత్తకపోవడంతో అనుమానం వచ్చి.. పక్కింటివారికి చెప్పారు. వారు వచ్చి చూసేసరికి ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు గమనించి తల్లిదండ్రులకు సమాచారం అందించారు. కార్తీక్ మొదటి సెమిస్టర్ పరీక్షలు సరిగ్గా రాయకపోవడంతో మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని అనుమానం వ్యక్తం చేస్తూ తండ్రి శ్రీనివాసులు శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

### రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలు మృతి

**చారకొండ:** రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలు మృతి చెందిన ఘటన శుక్రవారం రాత్రి మండలంలోని తిమ్మాయిపల్లిలో చోటు చేసుకుంది. ఎస్ఐ రాజశేఖర్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన నారమ్మ(60) వ్యవసాయ పొలం నుంచి ఇంటికి వస్తుండగా రోడ్డు దాటే క్రమంలో కల్వకుర్తి నుంచి దేవరకొండ వైపు వెళ్తున్న కారు ఆమెను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వృద్ధురాలు అక్కడికక్కడే మృతిచెందింది. ఘటనస్థలాన్ని ఎస్ఐ పరిశీలించారు. మృతదేహన్ని కల్వకుర్తి ఆస్పత్రికి తరలించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్ఐ తెలిపారు.

**విద్యుదాఘాతంతో వ్యక్తి..**

**ఖిల్లాఘనపురం:** బోరుమోటర్ తీసే సమయంలో వైర్లు తగిలి ఓ వ్యక్తి మృతిచెందాడు. వివరాలు ఇలా.. కొత్తపల్లితండాకు చెందిన సేవ్యానాయక్ వ్యవసాయమోటార్ కాలిపోయింది. మరమ్మతుల కోసం పెద్దమందడి మండలం వీరాయపల్లి చెందిన రహీం(45), మల్లేష్ శుక్రవారం వచ్చారు. కాలిపోయిన బోరుమోటర్‌ను బోరుబావిలో నుంచి తీసే సమయంలో పైన ఉన్న విద్యుత్ వైర్లను వారు గమనించలేదు. పైపును పైకి తీస్తుండగా కరెంట్ వైరుకు తగిలి రహీం అక్కడిక్కడే మృతి చెందాడు.

# అడవులు, వన్యప్రాణుల సంరక్షణ మనందరి బాధ్యత



సమస్యలతో వచ్చిన వారితో మాట్లాడుతున్న డీఎఫ్ఓ రోహిత్‌రెడ్డి

**మన్ననూర్:** అడవులు, వన్యప్రాణుల సంరక్షణ మనందరి బాధ్యత అని డీఎఫ్ఓ రోహిత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మన్ననూర్‌లోని ఎఫ్‌డీఓ కార్యాలయ ఆవరణలో ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. అమ్రాబాద్ పులుల రక్షిత అభయారణ్యం అమ్రాబాద్ డివిజన్ పరిధిలోని ప్రజలు ప్రస్తుతం ఆశించిన స్థాయిలో అటవీ శాఖకు సహకరిస్తున్నారని చెప్పారు. గతంలో అడవుల అభివృద్ధికి ఇంటి దొంగలే కారణమనే విమర్శలు ఉండేవని, అందుకు భిన్నంగా అధికారులు, సిబ్బంది, వాచర్లు ప్రత్యేకించి చెంచులు అభివృద్ధిలో భాగస్వాములు అవుతున్నారన్నారు. గతానికి, ఇప్పటికి బేరీజు వేసుకుంటే గతంలో వన్యప్రాణుల లెక్కలు అడవుల అభివృద్ధి కాగితాల్లో కనిపించేదని, ప్రస్తుతం పెద్ద పులులు, చిరుతలు, లేళ్లు, దుప్పులు, మనుబోతులు తదితర వన్యప్రాణులు ప్రకృతి ప్రియులు, ప్రజలకు కళ్లకు కట్టినట్లు కనిపిస్తున్నామని వివరించారు. ఇందులో భాగంగా వన్యప్రాణులు సంచరించే గడ్డి మైదానాలు, నీటి వనరులు (సాసర్ పీట్లు) ఉన్న ప్రదేశాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి ఆ పుటేజీల ద్వారా వాటిని చూసే అవకాశం కలిప్తున్నామన్నారు. ప్రస్తుత గణాంకాల ప్రకారం అమ్రాబాద్ ఫారెస్టు డివిజన్ పరిధిలోని వివిధ రేంజ్‌లలో గత 2018 లెక్కల ప్రకారం 160 చిరుత పులులు ఉంటే ప్రస్తుతం 2023 నాటికి వాటి సంఖ్య 173కు చేరుకోవడం గమనార్హం ఇదే స్థాయిలో అన్ని రకాలైన వన్యప్రాణుల సంఖ్య పెరిగిందన్నారు. అడవులు, వన్యప్రాణుల సంరక్షణ కోసం నిరంతరం పర్యవేక్షణతోపాటు అటవీ సమీప గ్రామ ప్రజల్లో అవగాహన కల్పించడంతో ఆశించిన ఫలితాలు వస్తున్నాయన్నారు. వేసవిలో వన్యప్రాణులకు ఎలాంటి నీటి ఎద్దడి, ఆహార సమస్యలు రాకుండా జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నామన్నారు. అభయారణ్యంలో గాయపడిన వన్యప్రాణుల రక్షణ కోసం ప్రొటెక్షన్ వ్యాన్‌లను (అంబులెన్స్‌లు) కూడా త్వరలో ఏర్పాటు చేస్తామన్నారు. గతంలో అడవుల్లో అక్రమ మైనింగ్, వన్యప్రాణులను వేటాడిన కేసులకు సంబంధించి పూర్తిస్థాయిలో సమాచారం సేకరించి పునరావృతం కాకుండా చర్యలు చేపడుతామన్నారు. అలాగే ఎఫ్ఆర్సీ పట్టాలు, పునరావాస ఏర్పాట్లు తదితర అంశాలపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి పరిష్కరించేందుకు కృషిచేస్తామన్నారు. సమావేశంలో ఎఫ్ఆర్ఓ ఆదిత్య, శ్రీధర్ పాల్గొన్నారు.

# పట్టుకున్నారు.. వదిలేశారు..

- అనుమతుల పేరుతో పక్కదారి పడుతున్న ఇసుక
- నిత్యం వందలాది ట్రాక్టర్లతో అక్రమంగా రవాణా



అచ్చంపేట తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో ఉన్న ఇసుక టిప్పర్

**అచ్చంపేట రూరల్:** దుందుభీని దున్నేయడమే మా లక్ష్యం అన్నట్లు అక్రమార్కులు అనుమతుల పేరుతో అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్నారు. ఉప్పునుంతల మండలంలోని మొల్గర, పెద్దాపూర్, సదగోడు, వంగూరు మండలంలోని ఉల్పర తదితర ప్రాంతాల నుంచి రాత్రింబవళ్లు ఇసుకను అక్రమంగా ట్రాక్టర్లు, టిప్పర్లతో తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. నియోజకవర్గంలో వివిధ ప్రభుత్వ పనుల పేరుతో అనుమతులు తీసుకుని ఇతర ప్రాంతాలకు ఇసుకను తరలిస్తున్నారు. శుక్రవారం ఓ కాంట్రాక్టర్ పేరుమీద వంగూర్ మండలం నుంచి నాగర్‌కర్నూల్‌కు ఇసుకను తరలించేందుకు అనుమతి ఉండగా అచ్చంపేట వైపు టిప్పర్‌ను మళ్లించారు. గమనించిన కొందరు స్థానికులు పట్టుకుని తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. టిప్పర్‌ను తహసీల్దార్ కార్యాలయానికి తరలించిన, కొద్ది సేపటికే వదిలేశారు. గతంలో కంటే విచ్చలవిడిగా అక్రమంగా ఇసుక తరలుతున్నా అధికారులు, పాలకులు పట్టించుకోకపోవడంపై విమర్శలు వస్తున్నాయి. సీఎం రేవంత్‌రెడ్డి అక్రమ ఇసుక రవాణాపై సీరియస్‌గా ఉన్నా.. సీఎం సొంత ప్రాంతంలో విచ్చలవిడిగా ఇసుక అక్రమంగా తరలడంపై విమర్శలు గుప్పుమంటున్నాయి. టిప్పర్‌ను వదిలేసిన ఘటనపై అచ్చంపేట తహసీల్దార్ మురళీమోహన్‌ను వివరణ కోరగా... టిప్పర్‌లో ఇసుక తరలించేందుకు నాగర్‌కర్నూల్‌కు అనుమతి ఉందని, నాగర్‌కర్నూల్‌కు కాకుండా అచ్చంపేటకు తీసుకురావడంతో టిప్పర్‌ను పట్టుకుని విచారించి వదిలి వేశామన్నారు. ఒక ప్రాంతానికి అనుమతి తీసుకుని మరో ప్రాంతానికి ఇసుకను తరలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

## రేషన్ బియ్యం పట్టివేత



పట్టుబడిన రేషన్ బియ్యం

**కేటీదొడ్డి:** కర్ణాటకలోని రాయచూర్‌కు రేషన్ బియ్యం తరలిస్తున్న వాహనాన్ని శుక్రవారం తెల్లవారుజామున పట్టుకున్నామని ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు. ఆయన కథనం మేరకు.. వివిధ గ్రామాల్లో కొనుగోలు చేసిన 22 కింటాళ్ల రేషన్ బియ్యాన్ని బొలెరో వాహనంలో రాయచూర్‌కు తరలిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం అందింది. దీంతో సిబ్బందితో కలిసి మండలంలోని మల్లాపురంతండా శివారులో వాహన తనిఖీలు చేపట్టగా పట్టుబడ్డాయని.. వాహనాన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించి డ్రైవర్ కృష్ణపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వివరించారు.

## పేకాట స్థావరంపై దాడి

- రూ.1.14లక్షల నగదు స్వాధీనం
- 21మందిపై కేసు నమోదు

**గద్వాల క్రైం:** రహస్యంగా పేకాట ఆడుతున్న వారిని అదుపులోకి తీసుకుని, నగదును స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ ఎస్ఐ పర్వతాలు తెలిపారు. మండలంలోని శెట్టిఆత్మకూర్ శివారులో శుక్రవారం సాయంత్రం గుట్టుగా పేకాట స్థావరం ఏర్పాటు చేసుకుని గద్వాల, ధరూర్, గట్టు మండలాలకు చెందిన 21 మంది పేకాట ఆడుతున్నట్లు సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్, సిబ్బంది సాయంతో మెరుపు దాడులు చేపట్టి ఐదుగురిని అదుపులోకి తీసుకున్నామన్నారు. 15 మంది పరారీలో ఉన్నారన్నారు. పట్టుబడిన వారిలో తిరుమలేష్ (బస్వాపురం), వెంకటేష్ (గట్టు), నర్సింహులు, ఎల్లప్ప(శెట్టి ఆత్మకూర్), ఎనుమూల లక్ష్మణ్ (గంజిపేట) వారిగా గుర్తించామన్నారు. వారి నుంచి రూ.1,14,580 నగదు, బైక్‌లు, సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేశామన్నారు. పరారీలోజున్న పద్మారెడ్డి, జానీ, టామాటా వెంకటేష్, తిమ్మరెడ్డి, మున్నూరుకాపు గోపాల్, జమల్‌సింగ్, చంద్రన్న, నత్తి నారాయణ, గోవిందు, వడ్డీల వెంకటన్న, సత్యం, కెమెరా రాముడు, గొల్ల ఆంజనేయులు, నిమ్మకాయల తిమ్మన్న, నరసింహులు, పాండులను త్వరలో అరెస్ట్ చేస్తామని ఎస్ఐ తెలిపారు.

## అటవీశాఖ చెక్‌పోస్టుల వద్ద నిబంధనల సడలింపు

**మన్ననూర్:** శ్రీశైలం ప్రధాన రహదారిపై మన్ననూర్, దోమలపెంట వద్ద ఉన్న అటవీశాఖ చెక్‌పోస్టుల్లో సాధారణ రోజుల్లో రాత్రి 9 నుంచి ఉదయం 6 వరకు వాహనాల రాకపోకలను నిలిపివేస్తారు. మహాశివరాత్రి, ఉగాదిని పురస్కరించుకొని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆయా చెక్‌పోస్టుల వద్ద నిబంధనలు సడలిస్తున్నట్లు డీఎఫ్ఓ రోహిత్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి 5 నుంచి 11వ తేదీ వరకు, తిరిగి ఏప్రిల్ 6 నుంచి 10వ తేది వరకు అన్నిరకాల వాహనాలను నిరంతరం అనుమతించనున్నట్లు పేర్కొన్నారు. వాహనాలు గంటకు 40 కిలోమీటర్ల వేగంతో వెళ్లాలని, అటవీ మార్గంలో హారన్ మోగించొద్దని, అటవీ పరిసరాల్లో వాహనాలు నిలుపరాదని సూచించారు. చెక్‌పోస్టుల వద్ద విధిగా వాహనం నంబర్లు నమోదు చేయించాలని, రోడ్డు మార్గంలో అటవీశాఖ సిబ్బంది తరచూ పెట్రోలింగ్ నిర్వహిస్తారని గమనించాలన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వాహనదారులపై వన్యప్రాణి సంరక్షణ చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## 'భీమా' వెలవెల..



మృతిచెందిన చేపలు

**కృష్ణా:** భీమానది వట్టిపోవడంతో అందులోని చేపలు, మొసళ్లు మృతి చెందుతున్నాయి. అలాగే నది పరీవాహక గ్రామాలైన సూకూర్ లింగంపల్లి, కుసుమర్తి, తంగిడి రైతులు సాగు చేసిన పంటలు నీరందక ఎండిపోతున్నాయి. అక్కడక్కడ గుంతల్లో నిలిచిన నీటిని తోడుకుంటున్నా సరిపోవడం లేదు. ఎగువన కర్ణాటకలో ఉన్న గూడూర్ బ్రిడ్జి కం బ్యారేజీ నిండుగా ఉందని.. కొంత నీటిని నదిలోకి వదిలితే మూగ జీవాలు తాగడానికి నీరు లభిస్తుందని, అలాగే నదిలోని ప్రాణులు బతికే అవకాశం ఉంటుందని రైతులు అంటున్నారు. ఈ విషయమై శుక్రవారం కృష్ణా మండల సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే వాకిటి శ్రీహరికి వినతిపత్రం అందించారు. రాయచూర్‌కు చెందిన మంత్రి బోసురాజుతో చర్చించి నీటి విడుదలకు ప్రయత్నిస్తానని ఆయన హామీ ఇచ్చారు.